

ఈదురుగాలులకు కుప్పకూలిన స్టేజీ

పలువురు టిడిపి నేతలకు గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

భవిష్యత్తుకు గ్యారెంటీ యాత్రలో భాగంగా నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెంలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో పార్టీ నేతలు ప్రసంగిస్తున్న సమయంలో ఈదురుగాలులకు స్టేజీ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో స్టేజీపై ఉన్న టిడిపి నేతలు చింతమనేని ప్రభాకర్, పీతల సుజాత, చినరాజప్పతో పాటు మరికొంతమంది నేతలు కింద పడిపోయారు. వెంటనే అక్కడ ఉన్న కార్యకర్తలు అప్రమత్తమై వారిని పైకి లేపారు. ఈ ఘటనలో పలువురు నేతలకు స్వల్పంగా గాయాలైనట్లు తెలుస్తోంది.

ఇంకెన్నాళ్లీ బతుకులు..!

నిలువునా మునుగుతున్నా అందని పరిహారం - లబోదిబోమంటున్న పోలవరం నిర్వాసితులు



ప్రజాశక్తి - కుక్కునూరు

'నిర్వాసితుల త్యాగాలతోనే రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది.. నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివి.. అలాంటి త్యాగధనులైన నిర్వాసితులకు సకల సౌకర్యాలతో కాలనీలు నిర్మించి, పూర్తి పరిహారమిచ్చి చిరునవ్వుతో పంపుతాం' ఇదీ నేటి పాలకుల మాటలు. అయితే వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే గత ఏడేళ్లుగా అదిగో పరిహారం.. ఇదిగో పరిహారం అని చెబుతూ ఏఒక్కరికీ పరిహారం ఇవ్వకుండా నిర్వాసితులను గోదావరి వరదల్లో ముంచుతుండటం అందరినీ తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పని లేకుండా చేసి కట్టుబట్టలతో చెట్టుకొకరు.. పుట్టకొకరుగా పరుగులు తీసే పరిస్థితిని మాత్రం పాలకులు నిర్వాసితులకు కల్పించారనేది నగ్నసత్యం. ఇదేనా నిర్వాసితులకు మీరిచ్చే విలువ అని ముంపు మండలాల నిర్వాసితులు ప్రభుత్వ తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది జులైలో గోదావరి వరదలకు మండలంలోని 15 పంచాయతీల్లో 98 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. దీంతో వరద బాధిత కుటుంబాలు పునరావాస కేంద్రాల్లో, కొండగుట్టలపై, చెట్ల కింద గుడారాలు వేసుకొని చిమ్మ చీకట్లో గడిపారు. చంటి పిల్లలు, వృద్ధులు మరుగుదొడ్లు లేక, తాగటానికి గుక్కెడు నీళ్లు దొరక్క, తినడానికి తిండిలేక మాడిపోయారు. ఎటువైపు నుంచి పాములు, తేళ్లు వంటి విష పురుగులు వస్తాయో అని భయంభయంగా అనేక ఇబ్బందులు పడుతూ తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అటు పాలకులుగాని, ఇటు ప్రభుత్వాధికారులుగాని పట్టించుకోలేదని, కేవలం కుటుంబానికి రూ.రెండు వేలు పరిహారమిచ్చి చేతులు దులుపుకున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. వరదల అనంతరం బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వరద బాధితులకు న్యాయం చేస్తానని, 2022 అక్టోబర్ నెలాఖరుకే ప్రతి నిర్వాసితునికీ వరద నష్ట పరిహారంతోపాటు పూర్తి పునరావాసం, పరిహారం ఇచ్చి చల్లావారిగూడెంలోని పునరావాస కాలనీలకు పంపుతామని చెప్పారు. ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. అదిగో పరిహారం.. ఇదిగో పునరావాసం అంటూ పూటకో సర్వే పేరుతో కాలం గడుపుతున్నారు తప్ప హామీలు అమలు చేయడం లేదని జనం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. జులై వస్తుండటంతో గోదావరి వరదలు వచ్చే ప్రమాదంతో ముంపు మండలాల నిర్వాసితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలు మునిగి, పనులు లేక, ఇళ్లు కొట్టుకుపోవడంతో మండలంలోని రజక బజారు, రామాలయం కాలనీ, మసీదు సెంటర్‌కు చెందిన 200 కుటుంబాలు ఇప్పటికీ కివ్వాక పునరావాస కాలనీల్లోనే తలదాచుకుంటున్నాయంటే ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వచ్చే వరదలను దృష్టిలో ఉంచుకుని తమకు రావాల్సిన పూర్తి పరిహారం ఇచ్చి, కేటాయించిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి తమను అక్కడికి పంపాలని కోరుతున్నారు.

ఎన్నాళ్లిలా బతకాలి..

షేక్ హుస్సేన్ బి, రజక బజారు, కుక్కునూరు



గతేడాది వచ్చిన వరదలకు నా ఇల్లు కొట్టుకుపోయింది. మగ దిక్కు లేని నేను పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలతో కివ్వాక పునరావాస కాలనీలో ఏడాదిగా ఉంటున్నాను. ఊరికి దూరంగా కాలనీ ఉండటంతో కూలీ పనులు లేక కేవలం నాకు వచ్చే పింఛన్ సొమ్ముతోనే బతుకుతున్నాను. నాకు కళ్లు కన్పించకపోవడంతో ఒక అమ్మాయి నా దగ్గరే ఉండాల్సిన పరిస్థితి. నాకు ఇంటి నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. ఎన్నాళ్లిలా బతకాలి. మాకు రావాల్సిన పరిహారం ఇచ్చి మాకు న్యాయం చేయాలి.

వరద ముంపుతో ఏటా ఈ బాధలు పడలేం

సత్యనారాయణ, కిరాణా కొట్టు, రామాలయం కాలనీ, కుక్కునూరు



ప్రతియేటా వరదలు వచ్చి ఊళ్లను ముంచిపోతున్నాయి. ఆ సమయంలో సామాన్లను వదిలి కట్టుబట్టలతో వెళ్లాల్సి వస్తుంది. వరదల అనంతరం మా ఇళ్లలో పేరుకుపోయిన ఒండ్రు, చెత్తా చెదారం శుభ్రం చేయడానికి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ ఖర్చవుతుంది. నా ఇల్లు పూర్తిగా మునిగింది. నేటికీ ఇంటి నష్టం కూడా రాలేదు. ఏటా ఈ బాధలు పడలేము. పరిహారం ఇచ్చి మమ్మల్ని పంపించండి.

పరిహారం ఇప్పించండి..

జొన్నమల్ల రమేష్, బెస్తగూడెం



గోదావరి వరదలకు మా ఇల్లు పూర్తిగా మునిగి పడిపోయింది. రెండు నెలలుగా రావికుంట పునరావాస కాలనీలో తలదాచుకున్నాం. ఇంటి నష్ట పరిహారం జాబితాలో మా గ్రామం పేర్లే లేవన్నారు. ఏడాది గడిచింది. మళ్లీ గోదావరి వస్తే మా పరిస్థితి ఏమిటీ. ప్రభుత్వం స్పందించి ఇంటి నష్టంతోపాటు పునరావాస పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాను.

ఖరీఫ్ నారుమళ్లు ముమ్మరం




- వర్షాల రాకతో సాగుకు రైతులు సన్నద్ధం
- రెండు జిల్లాల్లో 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఇప్పటివరకు 15 శాతం నారుమడులు పూర్తి
- నెలాఖరుకు నారుమళ్లు పూర్తయ్యే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ నారుమళ్ల పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. వర్షాల రాకతో రైతులు ఖరీఫ్ సాగుకు నడుం బిగించారు. జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ ఎండల నేపథ్యంలో రైతులు నారుమడులు వేసేందుకు వెనుకంజ వేశారు. గడిచిన రెండు, మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. దీంతో రైతులు ఖరీఫ్ పనుల్లోకి దిగారు. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.39 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఏలూరు జిల్లాలో లక్షా పది వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 శాతం నారుమళ్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు ఖరీఫ్ నారుమడులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో రైతులు ఎంటియు 1061, 1064, 7021 విత్తనాలను సాగు చేస్తున్నారు. ముందస్తు సాగుపై ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినప్పటికీ వడగాల్పులతో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే జులై నెలాఖరుకు ఖరీఫ్ నాట్లు పూర్తయ్యే అవకాశం కన్పిస్తోంది. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలని రైతులు కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేవలం కిలోకు రూ.ఐదు మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. దీంతో రైతులు విత్తనాల కోసం పెద్దఎత్తున సొమ్ము వెచ్చించాల్సి వచ్చింది.

కౌలు రైతులకు రుణాలిచ్చేనా..?

ఖరీఫ్ సాగు ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడులు పెద్దఎత్తున అవసరం. జిల్లా వ్యవసాయ సాగులో 75 శాతం సాగు కౌలు రైతులే చేస్తున్నారు. వీరందరికీ కౌలు కార్డులు అందించి రుణాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో కౌలు రైతులు ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల నుంచి పెట్టుబడి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నూటికి రూ.మూడుకుపైగా వడ్డీ భారం రైతులపై పడుతుంది. ఏప్రిల్‌లో కౌలు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించి ఇప్పటికే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికీ కౌలు కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. భూయజమాని అంగీకారంతో కౌలు కార్డులు ఇవ్వాలన్న చట్టంలోని నిబంధన కౌలు రైతులకు శాపంగా మారింది. ఇప్పటివరకు కౌలు కార్డులపై రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభించిన దాఖలాలూ కన్పించడం లేదు. సమావేశాలు, సభల్లో కౌలురైతుల గురించి చెప్పడమే తప్ప వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఇప్పటికైనా కౌలు రైతులకు కౌలు కార్డులు అందించి బ్యాంకుల నుంచి రుణాల మంజూరు చేయాల్సి ఉంది. లేకపోతే కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. అదే క్రమంలో కౌలు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించాలని కోరుతున్నారు.



నెక్లెస్ రింగ్‌బండ్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

నెక్లెస్ రింగ్‌బండ్ పటిష్టం చేసేందుకు చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ రింగ్ బండ్ గోదావరి వరదల సమయంలో కోతకు గురై పాత పోలవరం నుంచి ఎడ్లగూడెం వరకు నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రింగ్ బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకున్నామని పోలవరం తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. ఈ మేరకు నెక్లెస్ రింగ్ బండ్‌ను ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎజిఆర్‌బి ఎఇఆర్.సునీల్‌బాబుతో కలిసి తహశీల్దార్ బి.సుమతి శుక్రవారం పరిశీలించారు. గోదావరి వరదలు వచ్చే లోపు గోదావరి గట్టు పటిష్టం చేసేవిధంగా అధికారులు, నాయకుల సమన్వయంతో పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. గట్టు పరిశీలనలో వారితో పాటు వైసిపి యువజన నాయకులు శ్యామ్‌కుమార్, ప్రజలు ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీలకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేడేపల్లి హులీమేరీ డిమాండ్ చేశారు. శుక్రవారం చాట్రాయి గ్రామంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హులీమేరీ మాట్లాడుతూ ఎండ తీవ్రతకు తట్టుకోలేని వారికి మజ్జిగ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయడం లేదని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో లేవని, కూలీలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని చెప్పారు. కూలీలు మాట్లాడుతూ గత ఐదు వారాలుగా పనిచేస్తున్నా తమకు కూలి డబ్బులు రావడం లేదని, పూట గడవడమే కష్టంగా ఉంటుందని, ఇతర పనులు కూడా ఏమీ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పని మాత్రమే జీవనాధారమైందని, ఎండ తీవ్రతకు తట్టుకొని పనులు చేస్తున్న తమకు కూలి డబ్బులు పడటం లేదని వాపోయారు. కూలీలకు వెంటనే వెంటనే వేతనాలు మంజూరు చేయాలని, లేకపోతే సంబంధిత కార్యాలయం వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని హులీమేరీ హెచ్చరించారు.



గిరిజనుల విల్లంబులతో సిపిఎం రాష్ట్ర నేతలు

గోదావరి ప్రవాహంలా పాదయాత్ర

పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న యువత
'పోలవరం పోరుకేక'కు పెరుగుతున్న మద్దతు
గోడు చెప్పకుంటున్న పోలవరం నిర్వాసితులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక పాదయాత్ర గోదావరి ప్రవాహంలా ముందుకు సాగుతోంది. ఈ నెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో యాత్ర ప్రారంభమైన యాత్ర 21న కూనవరం మండలంలో అడుగుపెట్టింది. ఈ మండలంలో 32 గ్రామాల్లో సుమారు 50 కిలో మీటర్లు పైగా పాదయాత్ర సాగింది. కూనవరం మండలంలో పోలిపాక నుండి పోచవరం కాలనీ, పోచవరం, కాచవరం, దూగుట్ట, కూళ్లపాడు, నర్సింగపేట, పోట్లవాయిగూడెం, కరక గూడెం, కొండాయి గూడెం, గొమ్ముగూడెం జంక్షన్, పల్లూరు, మర్రిగూడెం, చూచిరేవుల గూడెం, భీమవరం, జగ్గవరం, టేకులబోరు, కొండ్రాజపేట, పూసుగూడెం, చిన్న ఆర్కూరు, పెద్ద ఆర్కూరు, రేపాక, భగవాన్ పురం, మల్లూరు, కూటూరు, అభిచర్ల, లింగాపురం, రేగులపాడు, కోడేరు, రాయిగూడెం, బొజ్జరాయిగూడెం గ్రామాల్లో పాదయాత్ర జరిగింది. అనంతరం శుక్రవారం చింతూరు మండలంలోకి అడుగుపెట్టింది. అన్ని గ్రామాల్లోనూ పాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. పాదయాత్ర సందర్భంగా ఏ జా న్సీ లో ఎర్రజెండా రెపరెపలాడుతోంది. గిరిజనుల హక్కుల కోసం సిపిఎం ఈ ప్రాంతంలో నిర్వహించిన పోరాటాలు ఫలితంగా ఆదివాసీలలో ఆ పార్టీకి చెరగని ముంద్ర ఉంది. తాజాగా నిర్వహించిన పోరుయాత్రలోనూ అదే ఒరవడి కనిపిస్తోంది. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో పాల్గొనటం ప్రత్యేకత సంతరించుకుంది. కూనవరం మండలంలో గ్రామ గ్రామాన గిరిజన యువత తరలివచ్చింది. దీంతో తొలుత సుమారు 500 మందితో ప్రారంభమైన యాత్ర 23వ తేదీనాటికి 800కు చేరింది. ఈ యాత్రకు వామపక్ష పార్టీలతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ మద్దతు తెలుపుతున్నారు.

గోడు చెప్పకుంటున్న నిర్వాసితులు

ఈ యాత్ర ఎదుట నిర్వాసితులు అనేక సమస్యలను విన్నవించారు. 'అభిచర్ల గ్రామంలో 250 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది వరదల సమయంలో నెల రోజులు ముంపులో ఉంది. మూడు కిలో మీటర్లు వెళ్లి గుడిసెలు వేసుకుని జీవనం సాగించాం. వ్యవసాయ భూమి అంతా మునిగిపోయింది' అని ఆ గ్రామస్తులు గోడు వినిపించారు.

'లింగాపురం 45.72 కాంటూరు పరిధిలో ఉందని చెబుతున్నారు. కాని గోదావరి భద్రాచలం వద్ద 37 మీటర్లకు చేరేనాటికే గ్రామం ముంపునకు గురైంది. 40 రోజుల పాటు గ్రామంలో వరద ముంపులో ఉంది. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. పంట పొలాలకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదు. నాలుగు సంవత్సరాల నుంచి ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా కల్పించలేదు. గ్రామంలో 150 కుటుంబాలు ఉండగా, వరద సహాయం 70 కుటుంబాలకు మాత్రమే అందించారు' అని లింగాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

'రేగులపాడులో 300 కుటుంబాలు ఉన్నాయి. 250 కుటుంబాలు మునిగిపోయాయి. అయినా ముంపు గ్రామంగా ప్రకటించలేదు. గ్రామంలో రోడ్లు లేవు, మంచినీటి సౌకర్యం పూర్తిగా లేదు. వరద సమయంలో ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదు' అని ఆ గ్రామస్తులు వాపోయారు.

'రాయిగూడెంలో 28 కుటుంబాలు ఉన్నాయి. మా అడ్రసులు బొజ్జరాయి గూడెం చిరునామాతో ఉన్నాయి. ఈ కారణంతో మాకు ఎటువంటి నష్టపరిహారం, పునరావాసం అందలేదు. గిరిజన కుటుంబాలకు ఎటపాక రాయన గూడెంలో భూములిచ్చారు. కాని అక్కడి భూ యజమానులకు ప్రభుత్వం నగదు చెల్లించలేదు. దీంతో నేటికీ సాగు చేసుకునే అవకాశం మాకు కల్పించలేదు' అని రాయిగూడెం గ్రామస్తులు తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు అండగా నిలవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం త్యాగం చేసి సర్వం మునిగిపోతున్న నిర్వాసితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల 20న నెల్లిపాక నుంచి బయల్దేరిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర ఈ నెల 26వ తేదీ ఏలూరు జిల్లాలో రుద్రమ్మకోట వద్ద ప్రవేశిస్తుందన్నారు. అనంతరం జీలుగుమిల్లి మండలంలో ప్రవేశించి 28వ తేదీ బుట్టాయగూడెం చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని జీలుగుమిల్లి, వంకవారిగూడెం, దర్భగూడెం గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించి పోరుకేక పాదయాత్రకు మద్దతు కోరారు. ఈ పోరుకేక కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెయ్యి మందికిపైగా నిర్వాసితులు పాదయాత్ర చేస్తున్నారన్నారు. అందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని వెంకటేశ్వర్లు కోరారు. దర్భగూడెం రైతులు మాట్లాడుతూ వివిధ పార్టీలు, పదవుల కోసం పాదయాత్రలు చేస్తుంటే సిపిఎం నిర్వాసితుల సమస్యలపై పనిచేయడం అభినందనీయమన్నారు. నిర్వాసితుల్లో ఒక గిరిజనులు లేరని రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక రంగాల వారున్నారని, వారందరూ సమస్యలపై జరిగే పాదయాత్రకు తమవంతు సహకారం పూర్తిగా అందిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రకు స్వాగతం చెప్పడంతోపాటు పోరు కేక యాత్ర బృందానికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రామకృష్ణ, కర్రి విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యులు ఎన్‌వి.అప్పారావు, సిరిబత్తుల సీతారామయ్య, సిహెచ్.కొండలరావు, రైతుసంఘం అధ్యక్షులు జానకిరామిరెడ్డి ఉన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



మాట్లాడుతున్న రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షత జరిగింది. ముఖ్యఅతిథి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూర్చే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం ముంపు మండలాల్లోని ప్రజలు తమ సర్వస్వం కోల్పోయి త్యాగం చేసినా పరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టు పనులు సాగించడం దుర్మార్గమన్నారు. వెంటనే నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులు ప్రారంభమై 15 సంవత్సరాలైనప్పటికీ నిర్వాసితులను గాల్లో దీపంలా వదిలేశారని విమర్శించారు. వర్షాకాలం వరదలు వచ్చి ఇళ్లు కూలిపోయి తినడానికి తిండి లేక, ఉండటానికి ఇల్లు లేక గిరిజనులు మృత్యువాత పడుతుంటే ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దున్నపోతు మీద వాన కురిసినట్లు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం గ్రామాలన్నీ మునిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వాటర్ ప్యాకెట్‌కూ ఆధార్ కార్డు అడిగి ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వాసితులకు రూ.12 వేల కోట్లు విడుదల చేసిందని, ఆ నిధులు నిర్వాసితులకు ఇవ్వకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. నిర్వాసితులకు పరిహారం సాధించటం కోసం నిర్వాసితులంతా ఐక్యంగా సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో పాల్గొనాలని, దీనికి రాజకీయ పార్టీలు, ప్రజలు మద్దతు తెలపాలని రవి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న జంగారెడ్డిగూడెం జెసి సెంటర్ ఖాళీ స్థలంలో నిర్వాసితుల సమస్యలపై భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యరావు, నేతలు వంగా గోపీ, ఎస్‌కె.మాబుసుభాని, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు, బి.రాంబాబు, కె.రాజు పాల్గొన్నారు.

మలేరియాపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

ఏలూరు టౌన్ : మలేరియా జ్వరాల పట్ల ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ సూచించారు. దెందులూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే, మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ మలేరియాపై అవగాహన కల్పించారు. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వస్తుందని, ఈ దోమలు గృహాల్లో గృహ పరిసరాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయని చెప్పారు. ఎవరైనా చలి జ్వరంతో బాధపడితే స్థానిక ఎఎన్ఎంని, ఆశా కార్యకర్తను సంప్రదించాలన్నారు. ఉచితంగా మలేరియా పరీక్షలు చేసి మందులు అందించను న్నట్లు తెలిపారు. తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టినట్లయితే మలేరియాగా అనుమానించి వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పించి, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ అందించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల అభివృద్ధి అధికారి, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



జలమయమైన రోడ్డు

వర్షానికి రోడ్లు జలమయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలో శుక్రవారం కురిసిన వర్షానికి కొమ్ముగూడెం సెంటర్‌లో రోడ్లు చెరువులా దర్శమిస్తున్నాయి. ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం రోడ్డుకు తొమ్మిది కిలోమీటర్ల మేరకు రూ.3.19 లక్షలతో రోడ్డు మంజూరైంది. పోలవరం ఎంఎల్ఎ బాలరాజు పనులకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దూరప్రాంత సర్వీసులకు పది శాతం రాయితీ

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం దూరప్రాంత సర్వీసులకు పది శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎసి, నాన్‌ఎసి సర్వీసులకు ఈ రాయితీ వర్తిస్తుందని, రాను పోను ఒకేసారి టికెట్ బుక్ చేసుకోవాల్సిన అవసరం ఉందని, అప్పుడు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి వెళ్లే టిక్కెట్ బుక్ చేసుకునేటప్పుడే రిటర్న్ టికెట్ కూడా బుక్ చేసుకోవాలని సూచించారు. జులై మూడో తేదీన ఆషాడ పౌర్ణమి, గురు పౌర్ణమి చాలా విశేషమైన రోజుఅని, ఆ సందర్భంగా అరుణాచలానికి బస్సులు జిల్లావ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బయలుదేరుతున్నాయని తెలిపారు. ఆరోజు సముద్రస్నానం చాలా విశేషం కాబట్టి అంతర్వేది నదీ సంగమ స్నానానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నామని, ఈ బస్సు స్నానానంతరం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, అప్పనపల్లి వెంకటేశ్వరస్వామి, భీమవరం మావుళ్లమ్మ తల్లి దర్శనానంతరం ఏలూరు చేరుకుంటుందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు రాయితీతో కూడిన, ఉచిత బస్సు పాసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బస్సు పాస్ కౌంటర్ ప్రత్యేకంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరచి ఉంచనున్నట్లు చెప్పారు. ఆదివారం కూడా ఒక పూట విద్యార్థుల సౌకర్యార్థం తెరచి ఉంచనున్నట్లు తెలిపారు. కార్గో బుకింగ్ సర్వీస్‌లో కొత్త ఎటిబి ఏజెంట్లకు అతి తక్కువ డిపాజిట్‌తో అవకాశం ఇస్తున్నామని, దీంతో నిరుద్యోగులకు మంచి కమిషన్ వస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌టిసి అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ జిఎల్‌పివి.సుబ్బారావు మాట్లాడుతూ కార్గో సేవలపై ప్రత్యేక దృష్టి పెడుతూ ప్రతిరోజు రివ్యూ చేస్తున్నామని, డిక్కీ బుకింగ్, బల్క్ బుకింగ్, టాప్ బుకింగ్‌లను కాంట్రాక్టర్ల ద్వారా తక్కువ రేట్‌కే రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్‌టిసి కార్గో సర్వీసుల్లో డోర్ డెలివరీ సౌకర్యం కూడా ఉందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. పిఆర్‌ఒ కెఎల్.నరసింహం పాల్గొన్నారు.




ర్యాలీలో పోలీసులు, నవజీవన్ బాల భవన్ అధ్యక్షులు, విద్యార్థులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ చెప్పారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నూజివీడులోని వాగ్దేవి జూనియర్ కళాశాల నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల పట్ల అవగాహన పెంపొందించుకుని వాటి వల్ల నష్టాన్ని స్నేహితులకు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు టౌన్ సిఐ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే వీటి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ టి.గోపాలకృష్ణ మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ ఎన్‌డిపిఎస్ చట్టం మాదకద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా చూస్తుందన్నారు. జరిమానాలు కఠినంగా ఉంటాయని చెప్పారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విజయవాడ, ఏలూరు, పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి జూని యర్ కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్, నూజివీడు పోలీస్ కానిస్టేబుల్స్, ఎస్ఇబి వారు, నవజీవన్ బాల భవన్ కో-ఆర్డినేటర్స్ బి.రవి, జె.ఆంజనేయులు, బి.రమేష్, కె.ప్రియాంక, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

రాయితీ విత్తనాలు అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని తెల్లంవారిగూడెం రైతు భరోసా కేంద్రం పరిధిలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఇంటి వద్ద శుక్రవారం రొట్ట విత్తనాలు, జనుము, జీలుగ, పిల్లిపెసర, వరి విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అందించారు. మండల పరిధిలో జనుము- 239 క్వింటాలు, జీలుగ 149 క్వింటాలు, పిల్లిపెసర 38 క్వింటాలు, వరి (బిపిటి 5204-94.7క్వి) (ఎంటియు 1061-114.3క్వి) (ఎంటియు-114.3క్వి) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీతో అందించే విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ఎంపిపి కారం శాంతి, మండల వ్యవసాయాధికారి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అగ్రికల్చర్ సిబ్బంది, రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. .



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

రూ.36.40 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

182 సెల్‌ఫోన్లను బాధితులకు అందించిన ఎస్‌పి

రికవరీ శాతం 55గా నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌పి మేరీ ప్రశాంతి సారథ్యంలో జిల్లాలో మరోమారు భారీగా సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న బాధితులకు అందించారు. జిల్లాలో ఎవరైనా తమ సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నా, అపహరణకు గురైనా 9550351200 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇస్తే పోలీసులు ఆ సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేసి రికవరీ చేసే ప్రక్రియకు ఆరు నెలల క్రితం శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎనిమిది పర్యాయాలు సెల్‌ఫోన్లను పెద్ద మొత్తంలో రికవరీ చేశారు. ఎనిమిదో సారి మొత్తం 182 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న వారికి ఎస్‌పి చేతులమీదుగా అందించారు. పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ నెల రోజుల క్రితం పెద్దమొత్తంలో సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామని తెలిపారు. ఇప్పుడు మరోసారి 182 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని తెలిపారు. వాటివిలువ దాదాపు రూ.36.40 లక్షలు ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్లను పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్ జిల్లా, అంబేద్కర్ కొనసీమ, కృష్ణా, విశాఖపట్నం, తెలంగాణ ఇలా వివిధ ప్రాంతాల నుంచి రికవరీ చేసినట్లు చెప్పారు. మొదటి పర్యాయంలో 80 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని తెలిపారు. రెండో పర్యాయంలో 141 సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందగా వాటిలో 94 ఫోన్లను, మూడోసారి 168 ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు అందగా 106 ఫోన్లను, నాలుగోసారి 108 ఫోన్లకు 13 ఫోన్లను, ఐదో సారి 222 సెల్‌ఫోన్లకు 116, ఆరోసారి 351 సెల్‌ఫోన్లకు 27, ఏడో సారి 300 ఫోన్లకు 113 సెల్‌ఫోన్లు, ఎనిమిదో సారి 370 సెల్‌ఫోన్లకు 182 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని తెలిపారు. ఈ ఏడాది కాలంలో మొత్తం 1,828 పోయిన సెల్‌ఫోన్లకు 1,003 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.2,05,78,184 ఉంటుందని తెలిపారు. రికవరీ 55 శాతంగా నమోదైనట్లు చెప్పారు. మొత్తం సెల్‌ఫోన్ రికవరీలో 12 కేసులు నమోదు చేసి పది మందిని అరెస్టు చేశామని తెలిపారు. అనంతరం రికవరీలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ సిల్ ట్రాఫికింగ్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సైబర్ సెల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఎస్‌పి అడ్మిన్ ఎంజెవి.భాస్కరరావు, ఏలూరు డిఎస్‌పి పి.శ్రీనివాసులు, సైబర్ సెల్ ఎస్ఐ రాజా పాల్గొన్నారు.

చెరువుగట్లు.. మందుబాబులకు ఆవాసాలు..!

నివాసితులకు ఇబ్బందులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


ముదినేపల్లి మంచినీటి చెరువు గట్టుపై మద్యం సీసాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మందుబాబులకు ఆవాసాలుగా మంచినీటి చెరువుగట్లు మారుతున్నాయి. మందుబాబులు మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి తమకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకొని అక్కడ సిట్టింగ్ వేసి మద్యం తీసుకుంటూ నానా యాగీ చేస్తున్నారు. ఇందుకు ఆవాసాలుగా ఆయా గ్రామాల్లోని మంచినీటి చెరువుగట్లను ఎంచుకుని తమ కార్యకలాపాలు జోరుగా సాగిస్తున్నారు. ఈ పరిస్థితి మద్యం దుకాణాలు ఉన్న ప్రతి గ్రామంలో, ప్రతిచోట కనబడుతోంది. ముదినేపల్లిలోని జిన్నాబాబు రైస్ మిల్లు సమీపంలో ఉన్న మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసిన మందును దుకాణానికి దగ్గరలో ఉన్న మంచినీటి చెరువుగట్టుపైకి తీసుకెళ్లి అక్కడ మందుబాబులు ఫూటుగా మద్యం తాగుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం మద్యం తాగుతుండడంతో చెరువు గట్టు అంతా బీరు, మద్యం సీసాలతో నిండిపోయింది. తాగిన మద్యం సీసాలను మందుబాబులు అక్కడ వదిలేస్తున్నారు. దీంతో మద్యం సీసాలతో, గ్లాసులతో చెరువుగట్టు దర్శనమిస్తోంది. మంచినీటి చెరువుగట్టును ఆనుకుని నివాసితులు ఉన్నారు. మందుబాబుల చేష్టలు, కేకలతో విసుగెత్తిన నివాసితులు వారిని మందలిచడంతో తరుచూ నివాసితులకు, మందుబాబులకు గొడవలు జరుగుతున్నాయి. చెరువుగట్టుపై మద్యం తాగరాదంటూ ఎంత చెప్పినా మందుబాబులు వినడంలేదంటూ నివాసితులు చెబుతున్నారు. "మా ఇష్టం మేము ఇక్కడే తాగుతాం" అంటూ ఎదురుదాడి చేస్తున్నట్లు నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ విషయమై పలుసార్లు ట్యాంకు ఆపరేటర్‌కు, పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదంటూ స్థానికులు వాపోతున్నారు. చెరువు గట్టుపై ఇంతా జరుగుతున్నా సదరు ట్యాంక్ ఆపరేటర్ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. దీంతో విచ్చలవిడిగా మద్యం తాగుతూ మందుబాబులు వీరంగం చేస్తున్నారు.

గ్రామాల్లో కాల్వగట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల భవనాలను, మామిడి, కొబ్బరి తోటలు, కల్వర్టులు, బస్‌షెల్టర్లు, అసంపూర్తిగా ఉన్న జగనన్న లేఆవుట్లను మందుబాబులు తమ కార్యకలాపాలకు అడ్డగా మార్చుకుంటున్నారు. దీంతో ఆయా చోట్ల అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. తెల్లవారేసరికి అంగన్‌వాడీ, పాఠశాలాల ఆవరణాల్లో మద్యం సీసాలు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ, పాఠశాలాల సిబ్బంది వాటిని తొలగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. మద్యం సీసాలు, గ్లాసులతో తాము తీవ్ర అవస్థలు పడుతున్నట్లు అంగన్‌వాడీ, పాఠశాలాల సిబ్బంది చెబుతున్నారు. సరస్వతీ నిలయాలను కూడా మందుబాబులు తమ ఆవాసాలుగా మార్చుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు, పోలీసులు నిఘా వేసి అసాంఘిక కార్యకలాపాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



భీమడోలులో...


ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ, కార్యక్రమ భీమడోలు మండల ప్రత్యేక అధికారి ఆర్.విజయరాజు కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని డిఆర్‌డిఎ పీడీతో పాటు మండల స్థాయి అధికారులు తిలకించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ మాట్లాడుతూ భీమడోలు మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ తేదీలు మారాయన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల వారీగా కార్యక్రమాలు నిర్వహించనున్న తేదీల వివరాలను ఆయన తెలిపారు. ఈ మేరకు జూలై ఒకటో తేదీ నుంచి 24వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమాల నిర్వహణకు రెండు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ఒక దానిలో భీమడోలు మండల అభివృద్ధి అధికారి సిహెచ్.పద్మావతిదేవితో పాటు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ సభ్యులుగా ఉంటారన్నారు. రెండో టీంలో భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీతో పాటు ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి ముత్తయ్య సభ్యులుగా ఉంటారన్నారు.

ముదినేపల్లి : అర్హులై ఉండి ఏ కారణంతోనైన ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటా జల్లెడ పట్టనున్నట్లు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావులేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి రాచూరి రాధా, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది విజయవంతంగా అమలు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని లోపుడి గ్రామ సచివాలయంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష అమలపై అవగాహన కల్పించి, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ కె సాయిరాం, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలవరం : అర్హులందరికీ అన్ని పథకాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ, ఎంపిపి సంఘాల అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తహశీల్దార్ బి.సుమతి, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, ఎంపిడిఒ జి.శ్రీను, ఎఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒలు వెంకటరమణ, మాధవరావు, హౌసింగ్ ఎఇ రమణరావు, ఎపిఎం బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి మీడియం సింగరాజు, యామల శ్రీదేవి, ఎంపిటిసి సభ్యులు, పిఆర్ఎఇ ఇన్‌ఛార్జి, అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్ కుమార్, సచివాలయ సిబ్బంది వీక్షించారు. మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్‌లో సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి సభ్యులు ఉలవల వరలక్ష్మి, ఉప సర్పంచి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి, సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది,


పోలవరంలో...

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మండవల్లి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డిప్యూటీ కలెక్టర్ జోనల్ మేనేజర్ ఎపిఐఐసి కె బాబ్జి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాలంటీర్లు జగనన్న సురక్షకు సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు జులై ఒకటో తేదీ నుండి 20 వరకు జరుగుతాయని తెలిపారు. తహశీల్దార్, ఎంపిడిఒతో కూడిన రెండు టీములు ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను త్వరితగతన పరిష్కరించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, తహశీల్దార్ రాజకుమార్, సెక్రటరీలు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రహదారి అభివృద్ధి

ప్రజాశక్తి - మండవల్లి


పనులు పరిశీలిస్తున్న సర్పంచి

శ్మశానానికి వెళ్లే రహదారి అభివృద్ధి చేసే విధంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని సర్పంచి బేతపూడి ఏసేబురాజు తెలిపారు. ప్రతిపాడులో జరుగుతున్న రహదారి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ శ్మశానానికి వెళ్లే దారి గోతులు పడి అధ్వానంగా మారిందన్నారు. ఆ దారిలో నుంచి వెళ్లాలంటే గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడేవారమని తెలిపారు. సమస్యను ఎంపిపి శ్రీరామదుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన వెంటనే స్పందించి రూ.ఐదు లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. దీంతో పూర్తిస్థాయిలో రహదారి నిర్మించి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తున్నామని ఆయన తెలిపారు. సమస్యను పరిష్కరించమని ఎంపిపి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన స్పందించి రూ.ఐదు లక్షల నిధులను వెంటనే కేటాయించడంతో ప్రత్తిపాడు గ్రామం తరపున ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జలజీవన్‌మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మండవల్లి


పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పుట్ల చెరువులో రూ.44 లక్షల నిధులతో చేపట్టిన జలజీవన్‌మిషన్ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు జల జీవన మిషన్ పథకం దోహదపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేసి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సంక్షేమం కోరి అనేక పథకాలను ప్రవేశపెట్టి ఇప్పటికే అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని చేసే విధంగా ప్రతిఒక్కరూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, సర్పంచి గురుగుపల్లి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచి వడ్లని నరసింహరావు మెట్ట వెంకటరావు, కోనా శ్రీనివాసరావు, గురుగుపల్లి నరసింహరావు, రంగారావు, మూల దిల్లేశ్వరరావు, సువారి ఎరకయ్య, ఆర్‌డబ్ల్యుసి కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి రాధిక, కాంట్రాక్టర్ రామారావు పాల్గొన్నారు.

26న పోలవరంలో బహిరంగ సభ : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం కోసం జూన్ 26వ తేదీన పోలవరంలో సిపిఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు పోలవరం నియోజకవర్గం కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో సిపిఐ నాయకత్వంలో జీపు జాతా నిర్వహించి విస్తృత ప్రచారం చేసినట్లు తెలిపారు. నిర్వాసితుల నష్టపరిహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నో త్యాగాలకు సిద్ధపడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఎంత అవసరమో, నిర్వాసితుల సమస్య పరిష్కారం కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ప్రాజెక్టు కోసం, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ అలుపెరగని ఉద్యమాలు, పోరాటాలు దశాబ్ద కాలంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. 26న నిర్వహించే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ కె.రామకృష్ణ, సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సంతోష్‌కుమార్, సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు, టిడిపి ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.తులసిరెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు కందుల దుర్గేష్, మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ చందా లింగయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, జెవి.సత్యనారాయణమూర్తి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. సిపిఐ నిర్వహిస్తున్న బహిరంగ సభకు పోలవరం నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.


సభ జరిగే స్థల వేదికను పరిశీలిస్తున్న కృష్ణచైతన్య

సభ జరిగే స్థల వేదిక పరిశీలన

పోలవరం : పోలవరంలోని బహిరంగ సభ జరిగే స్థల వేదికను కృష్ణచైతన్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం పునరావాస గ్రామాల్లో నిర్వాసితులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారన్నారు. ఉపాధి లేక, కూలీ పనులు కూడా సరిగా ఉండక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలను ఖాళీ చేయని నిర్వాసితులకు కాంటూరు పేరుతో గాలికొదిలేశారని విమర్శించారు. గత వరదలకు ఆర్థికంగా చితికిపోయారన్నారు. ప్రభుత్వానికి వీరి బాధలు పట్టకపోవడం దారుణమన్నారు. అన్ని పార్టీలతో కలిసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడం కోసం బహిరంగ సభ నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ సభతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. ఆయనతో పాటు పోలవరం, కొయ్యలగూడెం మండల కార్యదర్శులు జల్లేపల్లి వెంకట నరసింహారావు(జెవి), జమ్ము శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం మండల సహాయ కార్యదర్శి కుంచే వసంతరావు, పోలవరం పట్టణ కార్యదర్శి జల్లేపల్లి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశాఖలో వైద్యులు, సిబ్బందికి స్థానచలనం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో వైద్యశాఖకు సంబంధించి బదిలీల ప్రక్రియ దాదాపుగా పూర్తి కావచ్చింది. ఇప్పటికే వైద్యులు, జోనల్, జిల్లా స్థాయిలో బదిలీలు జరిగాయి. ఏలూరు జిల్లాలో ఒకే చోట ఐదేళ్ల పూర్తయి బదిలీలకు పెట్టుకున్నవారందరికీ బదిలీలకు అవకాశం కల్పించారు. జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది మెడికల్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. ఎల్ఎన్‌డి పేట, ధర్మాజీగూడెం, లింగపాలెం, టి.నరసాపురం, ఏలూరు పిపి యూనిట్, చాట్రాయి, మూలాలంక పిహెచ్‌సిలకు చెందిన వైద్యులు బదిలీ అయ్యారు. తెల్లదేవరపల్లి పిహెచ్‌సి నుంచి చాట్రాయికి ఒకరు బదిలీపై వచ్చారు. ఆగిరిపల్లి, చేబ్రోలు, టి.నరసాపురం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు వరుసగా పెనుమలూరు, మన్యం జిల్లా తాడికొండ, నల్లజర్లకు బదిలీ అయ్యారు. మూలాలంకలో పనిచేసే వైద్యాధికారి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి బదిలీ కాగా, అక్కడి వైద్యులు ఒకరు మూలాలంక వచ్చారు. ఇక రాజమండ్రి జోనల్ పరిధిలో ఐదేళ్లు దాటి పనిచేస్తూ బదిలీకి దరఖాస్తు చేసుకున్న 30 మందికి బదిలీలకు అవకాశం కల్పించారు. ఇందులో స్టాఫ్ నర్సులు, ఎంపిహెచ్‌ఇఒ, ఎంపిహెచ్ఎస్ మేల్, ఫిమేల్‌లు, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఉన్నారు. జిల్లా క్యాడర్‌లో ఒక్క జూనియర్ అసిస్టెంట్ మాత్రమే బదిలీకి దరఖాస్తు చేసుకోగా క్లియరెన్స్ ఉండడంతో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశా శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీకి అవకాశం కల్పించారు. ఇదిలా ఉంటే జిల్లా నుంచి పలువురు వైద్యులు బదిలీ అవ్వగా, ఆయా స్థానాలు ఇంకా భర్తీ కావాల్సి ఉందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశా తెలిపారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు ప్రధానాఉపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ తెలిపారు. జెడ్‌పి హైస్కూలును ప్లస్ టూ జూనియర్ కళాశాలగా ప్రభుత్వం ఆపరేట్ చేసినట్లు తెలిపారు. గతేడాది 45 మంది విద్యార్థులు ఇంటర్‌లో చేరగా ఈ సంవత్సరం 35 మంది చేరినట్లు తెలిపారు.

నేడు నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు రూరల్ : నూజివీడు పురపాలక సంఘం సమావేశ మందిరంలో శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన పట్టణాభివృద్ధి, సంక్షేమంపై కౌన్సిల్ సభ్యులతో చర్చ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కరిముల్లా, కిరణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో దోమల నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కారక్రమాలు నిర్వహించారు.

కళాశాలలో అంతర్జాతీయ ఒలింపిక్ డే

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అంజుధాలీ సారధ్యంలో శుక్రవారం అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎంజెకె.నరేంద్రకుమార్ బహుమతులు అందించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో, అధ్యాపకులతో ఒలంపిక్ రన్నింగ్ నిర్వహించారు

'వారాహి యాత్రను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి విజయ యాత్రను జయప్రదం చేయాలని జనసేన చింతలపూడి నియోజకర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 25వ తేదీ సాయంత్రం మూడు గంటలకు చించినాడ బ్రిడ్జి మీదుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలోకి వారాహి విజయ యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు, ఇతర రాష్ట్ర నాయకులకు స్వాగతం పాలికేందుకు జనసేన నాయకులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మేకా ఈశ్వరయ్య కోరారు. 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నరసాపురం పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.